క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు సోమవారం తెలిపారు. మండలంలోని గోపాలపట్నం, అన్నవరం గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి, సింహాద్రిపురం గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో జగ్గంపేట డీఈ కె.రత్నాలరావు సోమవారం తెలిపారు. ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే ప్రత్తిపాడు సబ్‌స్టేషన్‌లో మరమతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం డయిల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు తుని ఆర్టీసీ డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు బస్సు సర్వీసుల సమయం, రూట్లకు సంబంధించిన అంశాలను 73827 81490 నంబర్‌కు తెలియ పరచాలని ఆయన కోరారు.

పాదయాత్రకు అనుమతి నిరాకరణ సరికాదు

గోకవరం: రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని కోరుతూ తలపెట్టిన పాదయాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. పోలీసుల తీరుకు నిరసనగా సోమవారం రంపయర్రంపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, ఎండోమెంట్ శాఖ అధికారులు భూస్వాములకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఈ భూముల విషయంలో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కన్వీనర్ శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కాలువల్లో పూడిక తీత పనులు

తుని: పట్టణంలోని మురుగు కాలువల్లో పూడిక తీత పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. పట్టణ పరిధిలోని 10 కిలోమీటర్లు మేర కాలువల్లో పూడిక తీత పనులకు రూ.42.45 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రధాన కాలువల్లో పూడిక తొలగిస్తున్నామని కమిషనర్ ప్రసాదరాజు సోమవారం తెలిపారు. ప్రస్తుతం ఎస్.అన్నవరం లక్ష్మీదేవి చెరువు నుంచి ఆంజనేయస్వామి గుడి వరకూ ప్రధాన కాలువలో పనులు చేపట్టారు. దశల వారీగా ప్రధాన కాలువలను శుభ్రం చేస్తున్నారు. వేసవిలో పూడిక తీయడం వలన వర్షాకాలంలో మురుగు నీటి ప్రవాహనికి ఇబ్బంది ఉండదన్నారు. పూడిక పనుల్లో పాల్గొంటున్న కార్మికులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్టు ఆయన వివరించారు. ప్రజలు కాలువల్లో వ్యర్థాలను వేయవద్దని కోరారు.

మూల్యాంకనంపై అవగాహన

కోటనందూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో 'పాఠశాల పనితీరు–మూల్యాంకనం'పై హెచ్‌ఎంలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అందులో చదివే విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సామాజిక తనిఖీల్లో ప్రజలను భాగస్వాములు చేసి వారి అభిప్రాయాలు తెలుసుకోవడం ద్వారా పాఠశాలల పనితీరును మరింత మెరుగుపర్చవచ్చన్నారు. రిసోర్స్‌పర్సన్ ఏవీ సుబ్బురెడ్డి పాఠశాల పనితీరు–మూల్యాంకనంపై అవగాహన కల్పించారు.

బెల్ట్ షాపులపై దాడులు

జగ్గంపేట: మండలంలోని పలు బెల్ట్ షాపులపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో మద్యం అమ్ముతున్న రెండు పాన్‌షాపుల యజమానులను అరెస్టు చేసి వారి నుంచి 20 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

గండేపల్లి: మోటారు సైకిల్ ఢీకొట్టిన ఘటనలో మహిళకు గాయాలైనట్టు ఎస్సై వై. గణేష్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన గంగ్రెడ్డి నాగమణి ఆదివారం రాత్రి సుబ్బయమ్మపేట వెళ్లే మార్గంలో బహిర్భూమికి వెళ్లి తిరిగివస్తుండగా అదే మార్గంలో వస్తున్న గుర్తుతెలియని మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను బంధువులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. నాగమణి బంధువు నరం శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

జలము నిశ్చయంబు

- తాగునీటి సరఫరాలో తునికి అగ్రస్థానం
- వేసవిలోనూ ప్రజలకు పుష్కలంగా నీరు
- ఏటా నీటి పన్ను ద్వారా రూ.90 లక్షల ఆదాయం



తుని పట్టణం బాడవ తోటలో నీరు నిల్వ చేసే మెగా రిజర్వాయర్

తుని: పురపాలక సంఘంలో ప్రజలకు తాగు నీటి కష్టాలు లేకుండా అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా రోజుకు 7.15 మిలియన్ లీటర్స్ పర్ డే (ఎంఎల్‌డీ) అవసరం కాగా ప్రస్తుతం రోజుకు 6.15 ఎంఎల్‌డీ నీటిని అందిస్తున్నారు. సగటున మనిషికి రోజుకు 135 లీటర్లకు గాను 115 లీటర్లు సరఫరా చేస్తున్నారు. నూరు శాతం నీటిని అందించడానికి కేవలం ఒక ఎంఎల్‌డీ నీటిని అందుబాటులోకి తీసకువస్తే చాలు. దీనిలో భాగంగా అమృత్–2 పథకంలో రూ.9.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే రెండు మెగా రిజర్వాయర్లు, పంపు హౌస్, అదనపు పైపులైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. నాలుగేళ్ల పాటు దశల వారీగా వీటిని నిర్మిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు.

54,925 మంది జనాభా

తుని పట్టణం 7.02 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. 54,925 మంది జనాభా ఉన్నారు. 30 వార్డుల పరిధిలో 14 వేల కుటుంబాలు ఉన్నాయి. వీరందరికీ ప్రస్తుతం 6.15 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. సగటున మనిషికి రోజుకు 135 లీటర్ల నీరు అవసరం కాగా 115 లీటర్లు అందిస్తున్నారు. డ్రైవర్స్‌కాలనీ, బాడవతోట ప్రాంతాలకు మాత్రం వేసవిలో నీటి ఇబ్బందులు ఉన్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు సమ్మర్ ప్లాన్‌లో రూ.3.50 లక్షలు కేటాయించారు. రెండు ప్రాంతాలకు రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. రేఖవానిపాలెం, కట్రాళ్లకొండ, రాజీవ్‌గృహకల్ప, మార్కెట్, నూకాలమ్మ గుడి, నామగిరి వీధి, రామకృష్ణాకాలనీ తదితర ప్రాంతాల్లో పంపుహౌస్‌లు ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక, బాడవతోట, మార్కండ్రాజుపేట తదితర ప్రాంతాల్లో 6.15 ఎంఎల్‌డీ నీటిని నిల్వ చేసే రిజర్వాయర్లు ఉన్నాయి. ప్రతి పంపు హౌస్ దగ్గర క్లోరినేషన్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నారు.

ఆదాయం, వ్యయం సమానం

మున్సిపాలిటీకి నీటి పన్ను ద్వారా ఏటా రూ.90 లక్షలు ఆదాయం వస్తోంది. విద్యుత్ బిల్లులు, నిర్వహణకు రూ.90 లక్షలు ఖర్చువుతోంది. ఇది కేవలం డొమిస్టిక్ విభాగంలో వస్తున్న ఆదాయం. కమర్షియల్ కేటగిరిలో ఉన్న హోటల్స్, ఫంక్షన్ హాల్స్, ఆసుపత్రులు, తదితర వాటి నుంచి వస్తున్న ఆదాయం నామమాత్రమే. వీటికి మీటర్లు ఏర్పాటు చేస్తే వినియోగం ఆధారంగా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు కసరత్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తుని పురపాలక సంఘం పూర్తి వివరాలు	
మున్సిపాలిటీ గ్రేడ్ - 2	
విస్తీర్ణం:	7.02 చదరపు కిలో మీటర్లు
జనాభా :	54,925
కుటుంబాలు :	14,000
పైపులైన్ పొడవు :	74.33 కిలో మీటర్లు
పంపింగ్ మెయిన్ లైన్ :	1.80 కిలో మీటర్లు
నీటి నిల్వ చేసే రిజర్వాయర్లు :	11
పవర్ బోర్లు :	9
చేతి పంపులు :	214
ఇంటి కుళాయిలు :	5,549
వీధి కుళాయిలు :	317
నీరు డిమాండ్ :	7.15 ఎంఎల్‌డీ
ప్రస్తుతం సరఫరా :	6.15 ఎంఎల్‌డీ
మనిషికి రోజుకు	
సరఫరా చేయాల్సింది :	135 లీటర్లు
ప్రస్తుతం సరఫరా చేస్తుంది :	115 లీటర్లు
నీటి పన్ను ఆదాయం :	90 లక్షలు (ఏడాదికి)
నిర్వహణ వ్యయం :	90 లక్షలు (ఏడాదికి)

అమృత్–2 పథకంతో పరిష్కారం



పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్–2 పథకం ఉపయోగపడుతుంది. నాలుగేళ్ల పాటు పథకం పనులు కొనసాగుతాయి. రూ.9.50 కోట్లు నిధులు రానున్నాయి. వీటితో రెండు మెగా రిజర్వాయర్లు, పంపు హౌస్, అదనపు పైపు లైన్ల నిర్మాణం చేపడతాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. త్వరలో అనుమతులు రానున్నాయి.

– ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, తుని

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు



పట్టణ ప్రజలకు వేసవిలో సైతం ఉదయం, సాయంత్రం తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నాం. అందుబాటులో ఉన్న అన్ని వనరులను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. నీటి సరఫరాకు సంబంధించి నిధుల కొరత లేకుండా కేటాయింపులు చేస్తున్నాం. రెండు వార్డుల్లో నీటి సమస్య ఉందని కౌన్సిలర్లు తమ దృష్టికి తీసుకువచ్చారు. ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని అందించాలని ఆదేశించాం.

– ఏలూరి సుధారాణి, మున్సిపల్ చైర్ పర్సన్, తుని

పీపుల్స్ సర్వేలో ప్రత్తిపాడు ముందంజ

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో ప్రత్తిపాడు నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందంజలో ఉందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. శంఖవరంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 26 వరకూ రాష్ట్ర ప్రభుత్వం పీపుల్స్ సర్వే నిర్వహించిందన్నారు. పీపుల్స్ సర్వేలో ప్రత్తిపాడు నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో టాప్ 10లో నిలవడానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వంపై విశ్వాసం ఉందా ? లేదా ? అని ప్రజల మద్దతు తీసుకోవడం దేశంలో ఇదే మొదటిసారి అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఏలేశ్వరం మండలం జడ్డంగి, రౌతులపూడి మండలం ములగపూడిలో పీహెచ్‌సీలు, రౌతులపూడిలో నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు వంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపట్టామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎంపీపీలు పర్వత రాజుబాబు, గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీలు గొల్లు చిన్నదివాణం, నీలీకొండ రామకుమారి, పార్టీ మండల కన్వీనర్లు నరాలు శ్రీను, జిగిరెడ్డి శ్రీను, రామిశెట్టి చిన్నబాబు, వైఎస్సార్ సీపీ కాకినాడ బీసీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు, పార్టీ సీనియర్ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- అన్నవరంలో గడపగడపకూ..



అన్నవరంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

అన్నవరం: రాష్ట్రంలోని అర్హులందరికీ పక్కా ఇళ్లు నిర్మించడంలో దేశంలోనే రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. అన్నవరంలో సోమవారం ఆయన 'గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మూడో సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైన్లు, పింఛన్లు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం గొడేవారితోటలో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, వైస్ ఎంపీపీ ధారా వెంకటరమణ, ఎంపీడీఓ రాంబాబు, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాంపురంలో గడపగడపకూ..

జగ్గంపేట: మండలంలోని రాజపూడి శివారు సీతారాంపురంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.హరికృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలో అదనపు తరగతి గదులు ప్రారంభించి, గ్రామంలో సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దేశాభివృద్ధికి పల్లెలే పట్టుగొమ్మలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం
- పలు పంచాయతీలకు అవార్డులు



జగ్గంపేటలో సర్పంచులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



గోకవరంలో కార్యదర్శి శ్రీనివాస్‌రావుకు అవార్డు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు



శంఖవరంలో సర్పంచులకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

జగ్గంపేట: దేశాభివృద్ధికి పల్లెలే పట్టుగొమ్మలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ బి.హరికృష్ణ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు. స్థానిక సంస్థల ద్వారానే పరిపాలన ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. మండల పరిధిలో 27 పంచాయతీలకు పలు విభాగాల్లో అవార్డులు వచ్చాయి. ఆయా పంచాయతీల సర్పంచులకు ఎమ్మెల్యే అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, కో ఆప్షన్ సభ్యుడు జాన్ వెస్లీ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి సత్కారం

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా ఆధ్వర్యంలో పంచాయతీ ఈఓ గణేష్‌తో పాటు సిబ్బందిని, పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు.

గోకవరం: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. మండలంలో 14 పంచాయతీ ఉండగా 12 పంచాయతీలకు అవార్డులు వచ్చాయన్నారు. వీటిలో అత్యధికంగా కొత్తపల్లి, కామరాజుపేట పంచాయతీలు ఆరు చొప్పున అవార్డులు, గోకవరం పంచాయతీ నాలుగు అవార్డులు గెలుచుకున్నాయి. ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ఎంపీపీ, జెడ్పీటీసీలు అవార్డులు ప్రదానం చేశారు.

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీరాజ్ దినోత్సవానికి 12 మంది పంచాయతీ కార్యదర్శులు హాజరుకాకపోవడంతో వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంపీటీసీఈ సభ్యులు కొప్పుల బాబ్జీ, పసల సూరిబాబు పాల్గొన్నారు.



కోటనందూరులో సర్పంచులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన సోమవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో మండలస్థాయి అవార్డులకు ఎంపికైన బిళ్లనందూరు, ఇందుగపల్లి, టీజే నగరం, బొద్దవరం, కోటనందూరు, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాల సర్పంచులకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ ప్రశంసాపత్రాలు అందజేశారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం నిర్వహించారు. వివిధ విభాగాల్లో అవార్డులు పొందిన పంచాయతీల సర్పంచులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం పంచాయతీ సిబ్బందిని దుశ్శాలువాతో సన్మానించారు. సర్పంచులు ములంపాక సురేష్, రుత్తల లలిత, బలిరెడ్డి వరలక్ష్మి, సీలామంతుల వీరబాబు, మారిశెట్టి గంగాభవాని, గండేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షులు పరిమి బాబు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. అవార్డులకు ఎంపికైన వీరవరం, జగపతినగరం, బూరుగుపూడి, కృష్ణవరం, సింహాద్రిపురం, సోమవరం, గెద్దానాపల్లి పంచాయతీ సర్పంచులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరవరం సర్పంచ్ అంబటి బొజ్జమ్మ, పంచాయతీ సిబ్బందిని ఎంపీపీ తోట రవి, తోట గాంధీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: సమాజాభివృద్ధిలో గ్రామ పంచాయతీలు కీలక పాత్ర వహిస్తాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలో అన్నవరం, కత్తిపూడి, శంఖవరం, జి.కొత్తపల్లి, మండపం, నెల్లిపూడి, వజ్రకూటం, గౌరంపేట పంచాయతీలు ఉత్తమ పంచాయతీ అవార్డులకు ఎంపికయ్యాయి. కాగా ఆయా గ్రామాల సర్పంచులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, ఎంఈఓ ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. మండలంలో అవార్డులకు ఎంపికైన ఎ.కొత్తపల్లి, దానవాయిపేట, గొల్లముసలయ్యపేట, కొమ్మనాపల్లి, కృష్ణాపురం, ఒంటిమామిడి, పి.ఇ.చిన్నాయపాలెం, పైడికొండ, ఎల్లయ్యపేట పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ఎంపీపీ అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలోఎంపీడీఓ పసుపులేటి సతీష్, ఈవోపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, సర్పంచులు బెక్కం రాజావరలక్ష్మి, మడదా తిరుమల కుమారి, కోన అమ్మాజీ, అంగుళూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. అవార్డులకు ఎంపికైన రౌతులపూడి, ఎస్.పైడిపాల, గుమ్మరేగులు, ఎ.మల్లవరం, గంగవరం, రాజవరం, దిగువశివాడ తదితల గ్రామాల సర్పంచులకు అవార్డులు ప్రదానం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్ ఎంపీపీలు సాయి, లక్ష్మీ భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా ప్రత్తిపాడు



జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న ప్రత్తిపాడు సర్పంచ్ విజయలక్ష్మి

ప్రత్తిపాడు: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు గ్రామ పంచాయతీకి కాకినాడ జిల్లా స్థాయిలో 'ఆరోగ్యవంతమైన గ్రామం'గా ఉత్తమ పంచాయతీ అవార్డు దక్కింది. సోమవారం కాకినాడ జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మిని జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ సీఈఓ ఎన్‌వీ సత్యనారాయణ, డిప్యూటీ సీఈఓ రమణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విక్టర్, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం తదితరులు శాలువాతో సత్కరించారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



లోవ కొత్తూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

తుని రూరల్: మండల పరిధిలోని లోవ కొత్తూరు, వి.కొత్తూరు, రాజుపేట, డి.పోలవరం తదితర గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సర్పంచులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. లోవకొత్తూరులో జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు లంక కపానందం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికించారు.

భవిత కేంద్రానికి ఫిజియోథెరపీ సైకిల్ అందజేత

ఏలేశ్వరం: స్థానిక భవిత కేంద్రానికి సోమవారం దాకమర్రి లోవరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ సైకిల్ ఉచితంగా అందజేశారు. వైఎస్సార్ సీపీ నేత దాకమర్రి సూర్యనారాయణ జ్ఞాపకార్థం ట్రస్టు ప్రతినిధులు ఈ సైకిల్‌ను అందజేశారు. భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందించేందుకు ఈ సైకిల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, దిలబర్‌హూస్సేన్, వాగు బలరామ్, తొండారపు రాంబాబు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ నిరసన

ప్రత్తిపాడు: తమ స్థలాన్ని కబ్జా చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రత్తిపాడు జాతీయ రహదారి వద్ద కిర్లంపూడి మాజీ ఎంపీపీ మూరా సహదేవుడు సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. స్థానిక ఎన్‌హెచ్‌ను ఆనుకొని సర్వే నంబరు 270/4లో 23 సెంట్ల భూమిని కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన తిబిరిశెట్టి రాంబాబు నుంచి ఆయన కొనుగోలు చేశారు. దీనిలో కొంతభూమిని కొందరు ఆక్రమించుకున్నారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఆమరణ నిరసన చేపట్టినట్టు సహదేవుడు తెలిపారు. ఆయనతో పాటు మూరా రాఘవ, ఇంజుమళ్ల అప్పారావు నిరసన దీక్ష చేపట్టారు.

చలివేంద్రం ప్రారంభం

జగ్గంపేట: స్థానిక పోలీసు స్టేషన్ వద్ద శశి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం సీఐ సూర్య అప్పారావు ప్రారంభించారు. తొలిరోజు బాటసారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రస్తుత వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా, ఎస్సై విద్యాసాగర్, శశి చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నీలి నరసింహరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ సూచించారు. పట్టణంలో సోమవారం బీజేపీ పట్టణాధ్యక్షుడు గట్టిం వెంకటరమణ అధ్యక్షతన బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమపథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. తొలుత పట్టణంలో ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం స్థానిక చైతన్యనగర్ బూత్ కమిటీ లిస్టులను పార్టీ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గట్టెం సీతారామ్, కొప్పుల రాంబాబు, లింగం దుర్గ, వాడపల్లి చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



బొద్దవరంలో గొంపమ్మతల్లి గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కోటనందూరు: బొద్దవరంలో సోమవారం గొంపమ్మతల్లి గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. అమ్మవారి జాతర సందర్భంగా వారం రోజుల క్రితం తీసిన గరగలతో వందలాదిగా భక్తులు గొంపకొండ చుట్టూ 10 కిలోమీటర్ల మేర తిరిగి అమ్మవారిని దర్శించారు. ఏటా గొంపమ్మతల్లి జాతరకు ముందురోజు గిరిప్రదక్షిణ చేయడం ఆచారంగా వస్తోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా మంగళవారం గొంపమ్మతల్లి జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.